సాక్షి
నల్లగొండ
సోమవారం, 11, ఆగస్టు, 2025



అన్ని రంగాల్లో విఫలం

కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. - 8లో



యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ

యాదగిరి క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం కావడంతో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. - 8లో

సాగర్ సమాచారం



పూర్తిస్థాయి నీటి మట్టం : **590** అడుగులు

ప్రస్తుత నీటి మట్టం	:	**590.00** అడుగులు
ఇన్‌ఫ్లో	:	**65,842** క్యూసెక్కులు
అవుట్ ఫ్లో	:	**1,09,952** క్యూసెక్కులు
విద్యుదుత్పాదన కేంద్రం ద్వారా	:	**29,394** క్యూసెక్కులు
కుడికాల్వ ద్వారా	:	**6,465** క్యూసెక్కులు
ఎడమకాల్వ ద్వారా	:	**7,518** క్యూసెక్కులు
ఏఎమ్మార్పీకి	:	**1,800** క్యూసెక్కులు
వరద కాల్వకు	:	**300** క్యూసెక్కులు

న్యూస్‌రీల్

నేడు చిట్యాలకు మంద కృష్ణమాదిగ రాక

చిట్యాల : చేయూత పింఛన్లను వెంటనే పెంచాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చిట్యాలలో సోమవారం నిర్వహించనున్న నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల స్థాయి సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ రానున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్ మాదిగ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి చేయూత పింఛన్‌దారులు, దివ్యాంగులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

ప్రజాసేవ చేయడమే లయన్స్ క్లబ్ లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న బాబురావు

నల్లగొండ టౌన్: పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యంగా లయన్స్ క్లబ్ ముందుకెళ్తోందని లయన్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ లయన్ డాక్టర్ ఘట్టమనేని బాబురావు అన్నారు. ఆదివారం నల్లగొండలోని గుండగోని మైసయ్య ఫంక్షన్ హాల్‌లో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ 2025–26 జిల్లా కేబినెట్ ఇన్‌స్టాలేషన్ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి మాట్లాడారు. సేవే పరమావధిగా స్థాపించబడిన లయన్స్ క్లబ్ నేడు ప్రపంచవ్యాప్తంగా పేదప్రజలకు చేయూతగా నిలుస్తూ ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతోందన్నారు. ప్రకృతి వైపరీత్యాలు, కరోనా సమయంలో కూడా పేదప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సునీల్‌కుమార్ రూమాల్ల, గోపాల్‌రావు, దీపక్ బట్టాచార్య, టి.రాజేంద్రప్రసాద్, రాజిరెడ్డి, భీమయ్య, కేవీ.ప్రసాద్, సతీష్ కుమార్, రామకృష్ణ, అశోక్ రెడ్డి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

ఆత్మగౌరవ పోరుకు యాదవులు సిద్ధంకావాలి



మాట్లాడుతున్న ఏడుకొండలు యాదవ్

నల్లగొండ టౌన్: యాదవులు ఆత్మగౌరవ పోరాటానికి సిద్ధం కావాలని అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షుడు ముచ్చర్ల ఏడుకొండలు యాదవ్ పిలుపునిచ్చారు. ఆదివారం నల్లగొండలోని యాదవ సంఘం భవన్‌లో ఏర్పాటు చేసిన ఆ మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడారు. అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో సోమవారం చేపట్టిన రెజాంగ్లా రజ్ కలశ యాత్రను విజయవంతం చేయాలన్నారు. యాత్రలో భాగంగా దేవరకొండ, కొండమల్లేపల్లి, గుర్రంపోడు, కనగల్ ప్రాంతాల్లో సభలు, ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. అలాగే 12వ తేదీన మధ్యాహ్నం 2:30 గంటలకు నల్లగొండలోని క్లాక్‌టవర్‌లో ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. యాదవుల ఆత్మ గౌరవం పెంచడానికి అహిర్ రెజిమెంట్ ప్రకటించాలని ఇండియన్ ఆర్మీని, కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఈ యాత్ర కొనసాగుందన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి లొడంగి గోవర్ధన్ యాదవ్, సోమనబోయిన సుధాకర్ యాదవ్, పిల్లి రామరాజు యాదవ్, కొలగాని పర్వతాలు యాదవ్, ఎల్‌వీ.యాదవ్, తరాల పరమేశ్ యాదవ్, గంగుల చందువంశీ యాదవ్, గుండెబోయిన జానయ్య యాదవ్, ముప్పిడి మల్లయ్య యాదవ్, ఎడ్ల శ్రీనివాస్ యాదవ్, గోగుల శ్రీనివాస్ యాదవ్, జాల నారాయణ యాదవ్ పాల్గొన్నారు.

యాదగిరీశుడికి నిత్యారాధనలు



ఉత్సవమూర్తులకు పూజలు చేసి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో ఆదివారం సంప్రదాయ పూజలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువ జామున స్వామివారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, ఆరాధన.. గర్భాలయంలో స్వయంభూలకు అభిషేకం, సహస్రనామార్చనలు నిర్వహించారు.

రాబడి స్వల్పం.. ఖర్చు అధికం

నీలగిరి మున్సిపాలిటీలో ఖర్చులకు తగ్గట్టు రాని ఆదాయం

- ఖర్చు రూ.2.84 కోట్లు.. ఆదాయం రూ.2 కోట్ల లోపే..
- నెలనెలా జమకాని భవనాల అనుమతుల సొమ్ము
- మున్సిపల్ సిబ్బందికి తప్పని సర్దుబాటు ఇక్కట్లు
- కార్మికుల వేతనాలు ప్రభుత్వం ఇస్తే తప్పనున్న భారం



నల్లగొండ మున్సిపల్ కార్యాలయం

నల్లగొండ టూటౌన్ : నీలగిరి మున్సిపాలిటీలో ఖర్చులకు తగ్గట్టు ఆదాయం రావడం లేదు. నెలనెలా రూ.2.84 కోట్ల ఖర్చు వస్తుంటే..ఆదాయం మాత్రం రూ.2 కోట్లలోపే ఉంటోంది. దీంతో ఖర్చులను సర్దుబాటు చేసేందుకు మున్సిపల్ అధికారులు ప్రతినెలా ఇబ్బందులు పడుతున్నారు. నీలగిరి మున్సిపాలిటీ విస్తరణకు తగ్గట్టుగానే కార్మికులు, ఉద్యోగులను నియమించారు. మున్సిపాలిటీ పరిధిలోని 48వార్డుల్లో మొత్తం 43 వేలకు పైగానే భవనాలు ఉండగా ఏడాదికి రూ.18 కోట్ల ఆస్తి పన్ను ద్వారా ఆదాయం వస్తుంది. నల్లా కనెక్షన్లు మాత్రం 29వేల వరకే ఉండగా వీటి ద్వారా ఏడాదికి రూ.3 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ఆస్తి పన్ను, నల్లా బిల్లులు కలుపుకుంటే మొత్తం రూ.21 కోట్ల రాబడి వస్తుంది. భవనాలకు అనుమతుల ద్వారా నెలకు రూ.కోటి వరకు ఆదాయం వస్తుంది. కానీ ఈ డబ్బులు నేరుగా సీడీఎంఏ ఖాతాలో జమ అవుతుండగా.. ఐదారు నెలలకు ఒకసారి మున్సిపాలిటీలకు ప్రభుత్వం పంపుతుంది. కానీ మున్సిపాలిటీలో అన్ని ఖర్చులకు ఏడాదికి దాదాపు 34.08 కోట్ల వరకు అవుతుందని అధికారులు చెబుతున్నారు.

813 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు

పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంతోపాటు వివిధ పనుల కోసం మొత్తం 813 మంది ఔట్‌సోర్సింగ్ కార్మికులు ఉన్నారు. మున్సిపల్ సాధారణ నిధుల నుంచి వీరికి నెలకు వేతనాల కింద రూ.1.20 కోట్లు చెల్లించాల్సి వస్తుంది. వాహనాల డీజిల్‌కు రూ.22 లక్షలు, పంప్‌హౌస్, వీధి దీపాలు, పవర్ బోర్స్, ఆఫీస్ కరెంట్ బిల్లు నెలకు రూ.75 లక్షల వరకు వస్తుంది. ఎన్ఎంఆర్ ఉద్యోగులు వేతనాలు నెలకు రూ.7.50 లక్షలు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ఈపీఎఫ్ నెలకు రూ.40 లక్షలు, పైప్‌లైన్, లీకేజీ మరమ్మతుల నిర్వహణ ఖర్చులు రూ.10 లక్షలు, వాహనాల నిర్వహణ ఖర్చు నెలకు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు అవుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మున్సిపాలిటీకి నిర్వహణ ఖర్చులు భారీగా పెరుగుతుండగా, ఆదాయం మాత్రం అనుకున్నంతగా రావడంలేదని తెలుస్తోంది.

010 పద్దు ద్వారా వేతనాలు ఇస్తే సరి..

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేస్తామని గత అసెంబ్లీ ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు కార్మికులు చెబుతున్నారు. ఆ హామీ ప్రకారం కార్మికులను రెగ్యులరైజ్ చేసి 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వడం ద్వారా మున్సిపాలిటీకి వేతనాల భారం తప్పనుంది. గ్రామ పంచాయతీ కార్మికులకు ఇస్తున్న మాదిరిగా.. వీరికి కూడా రాష్ట్ర ప్రభుత్వమే వేతనాలు ఇస్తే మున్సిపాలిటీకి నిర్వహణ భారం నుంచి విముక్తి కలగనుంది.

ఆదాయ వనరులు పెంచుతాం



కరెంట్ బిల్లులు, కార్మికుల వేతనాలు, వాహనాలు పెరగడంతో డీజిల్ ఖర్చులు కూడా పెరిగిపోయాయి. మున్సిపాలిటీకి పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఆదాయ వనరులు కూడా పెంచేలా చర్యలు తీసుకుంటున్నాం.

– సయ్యద్ ముసాబ్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్

ఆదాయ వనరుల పెంపుపై దృష్టేదీ?

పట్టణంలో ఏర్పాటవుతున్న వ్యాపారాలన్నింటినీ ఎప్పటికప్పుడు అసెస్‌మెంట్ చేయడం ద్వారా మున్సిపాలిటీ ఆదాయ వనరులు పెంచుకునే వెసులుబాటు ఉంటుంది. కానీ అధికారులు, సిబ్బంది సమన్వయలోపం, రాజకీయ నాయకుల ఒత్తిళ్ల కారణంగా ఆస్తి పన్నును పెంచుకోవడంలో విఫలమవుతున్నారనే చర్చ సాగుతోంది. ఆదాయ వనరును అందిపుచ్చుకోవాలని సీడీఎంఏ అధికారులు చెబుతున్నా ఆ దిశగా మున్సిపల్ యంత్రాంగం అడుగులు వేడయంలేదు. ఆస్తి పన్ను, నల్లా బిల్లుల ద్వారా ఆదాయం దాదాపు రూ.40 కోట్ల వరకు పెరిగే అవకాశం ఉన్నా.. ఆ దిశగా దృష్టి పెట్టడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా పెరిగిన ఖర్చులకు అనుగుణంగా ఆదాయాన్ని పెంచుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

● ముత్యాలమ్మకు బోనం





శ్రావణమాసం మూడవ ఆదివారం సందర్భంగా నల్లగొండలోని రామగిరిలో గల ముత్యాలమ్మకు బోనాలు సమర్పించేందుకు ఆలయంలో బారులుదీరిన భక్తులు - రామగిరి(నల్లగొండ)

రోగులకు ఇబ్బందులు రానివ్వద్దు

- కలెక్టర్ ఇలా త్రిపాఠి



ఆస్పత్రిలో సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ టౌన్: రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా మెరుగైన వైద్యసేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. నల్లగొండలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో వార్డుల్లో ఉన్న పేషెంట్లకు ఎక్స్ రేలు, స్కానింగ్, ఇతర పరీక్షలు చేయాలంటే వార్డు నుంచి అర కిలోమీటర్ దూరంలో ఉన్న రేడియాలజీ డిపార్ట్‌మెంట్ వరకు ఎండలో స్ట్రక్చర్, వీల్‌చైర్లపై, నడిపిస్తూ తీసుకెళ్తున్న పరిస్థితిపై 'రోగులకు పరీక్ష కష్టాలు' శీర్షికన ఆదివారం 'సాక్షి'లో ప్రచురితమైన ప్రత్యేక కథనానికి కలెక్టర్ స్పందించి ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసీయూ, సర్జికల్, మెడికల్ వార్డులతోపాటు రేడియాలజీ విభాగాన్ని పరిశీలించి వైద్యులు, నర్సులను పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రేడియాలజీ విభాగం దూరంగా ఉండడంతో నడవలేని రోగులకు మొబైల్ ఎక్స్ రే యూనిట్ ద్వారా ఎక్స్ రే తీస్తున్నట్లు, నడవగలిగే వారిని వీల్‌చైర్ మీద రేడియాలజీ రూమ్‌కు తీసుకెళ్తున్నట్లు వైద్యులు కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వచ్చే రోగులకు డాక్టర్లు, సిబ్బంది, నర్సులు అందుబాటులో ఉంటూ సకాలంలో వైద్యం చేయాలని ఆదేశించారు. ఆస్పత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తేవాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్ వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్, ఆర్ఎంఓ కిరణ్‌కుమార్, టీఎస్ఎంఐడీసీ రాజశేఖర్, జితేందర్ పాల్గొన్నారు.

సాక్షి ఎఫెక్ట్

బీసీ రిజర్వేషన్ బిల్లు ఆమోదించాలి



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

మిర్యాలగూడ అర్బన్ : బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం మిర్యాలగూడలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బికార్ మల్లేష్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్రానికి పంపారని, కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సాకు చూపి బిల్లును వ్యతిరేకించడం సరైంది కాదన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుకు అన్ని పార్టీలు మద్దతు పలకాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, అయ్యూబ్, మల్లయ్య, గాదె పద్మ, గోవర్ధన్, సైదులు, ఊర్మిళ, పాపిరెడ్డి, వెంకటేశ్వర్లు, రామారావు, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, వజీర్ పాల్గొన్నారు.


చేనేత కార్మికులందరికీ భరోసా కల్పించాలి

గట్టుప్పల్ : ఎలాంటి షరతులు లేకుండా జియోట్యాగ్ కలిగిన చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా కల్పించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. ఆదివారం గట్టుప్పల్ మండల కేంద్రంలో నిర్వహించిన చేనేత కార్మిక సంఘం మండల మహాసభకు హాజరై మాట్లాడారు. చేనేత కార్మికులు, సహకార సంఘాల దగ్గర నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాలు తీసుకున్న రుణాలను క్యాష్ క్రెడిట్ మాఫీ చేయాలన్నారు. ఇల్లులేని పేదలకు 120గజాల స్థలం ఇవ్వడంతోపాటు కేంద్రం రూ.10 లక్షలు, రాష్ట్రం రూ.5 లక్షలు అందజేసి హౌస్ ప్రంవర్క్ షెడ్డు నిర్మాణం చేసి ఇవ్వాలన్నారు. అనంతరం నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా గంజి కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి వెంకటేశంతోపాటు పలువురు కమిటీ సభ్యులుగా నియమించారు. కర్నాటి వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కర్నాటి మల్లేశం, పున్న కిషోర్, గణేష్, బావండ్ల ఆంజనేయులు, చెరుపల్లి సత్యనారాయణ, అందె రాము, చెరుపల్లి కృష్ణయ్య, శంకర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



గట్టుప్పల్‌లో మాట్లాడుతున్న గంజి మురళీధర్

మూసీకి స్వల్పంగా తగ్గిన ఇన్‌ఫ్లో



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకు పోతున్న వరదనీరు

- మూడు గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు వరద ఉధృతి స్వల్పంగా తగ్గింది. ఆదివారం ఎగువ ప్రాంతాల నుంచి మూసీకి 4,365 క్యూసెక్కుల వరదనీరు వచ్చి చేరింది. ప్రాజెక్టులో నీటిమట్టం గరిష్టస్థాయిలో ఉండడంతో అధికారులు శనివారం ఐదు గేట్లు తెరవగా రెండింటిని ఆదివారం మూసి వేశారు. మిగతా మూడు గేట్లను రెండు అడుగుల మేర పైకి ఎత్తి 3,850 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. కాగా 645 అడుగుల గరిష్ట నీటిమట్టం గల మూసీ రిజర్వాయర్ ప్రస్తుతం 643.50 అడుగుల వద్ద ఉంది. ఆయకట్టులో వానాకాలం పంటల సాగుకు ప్రాజెక్టు కుడి, ఎడమ ప్రధాన కాల్వకు 454 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. మూసీ రిర్వాయర్‌లో పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.02 టీఎంసీల నీరు నిల్వ ఉందని మూసీ ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సరికొత్తగా ఓటరు జాబితా

పంచాయతీల వారీగా రూపకల్పన

- ప్రతి పల్లెకు ప్రత్యేక టీపోల్ లాగిన్
- వార్డుల వారీగా అప్‌లోడ్ చేసిన కార్యదర్శులు
- మరో మూడు రోజుల్లో జాబితా ప్రకటన
- ఈ జాబితాతోనే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించే అవకాశం



గ్రామ పంచాయతీలు	869
వార్డుల సంఖ్య	7,494
ఓటర్లు	10,53,920

(పార్లమెంట్ ఎన్నికల ఓటరు జాబితా ప్రకారం)

నల్లగొండ: గ్రామ పంచాయతీల్లో సరికొత్త ఓటరు జాబితా సిద్ధమవుతోంది. గతంలో ఎంపీడీఓ పరిధిలో ఉన్న టీపోల్ లాగిన్‌లో ఆయా గ్రామాల వారీగా పంచాయతీ కార్యదర్శులు ఓటర్ల జాబితాలను అప్‌లోడ్ చేశారు. అయితే గత విధానాన్ని పంచాయతీరాజ్ శాఖ మార్పు చేసింది. కొత్తగా ప్రతి గ్రామానికి ఒక టీపోల్ లాగిన్ ఇచ్చి గ్రామ పంచాయతీ లాగిన్‌లో ఓటర్ల జాబితాను అప్‌లోడ్ చేయాలని ఆదేశించింది. దీంతో ఇరవై రోజుల నుంచి కార్యదర్శులు జీపీ లాగిల్‌లో వార్డుల వారీగా ఓటరు జాబితాను అప్‌లోడ్ చేశారు. జిల్లాలో కొత్త ఓటరు జాబితా తయారీ చివరి దశకు చేరిందని మరో రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని అధికారులు పేర్కొంటున్నారు.

గతంలో ఎంపీడీఓ లాగిన్‌లో..

పంచాయతీ ఎన్నికలు గత ఫిబ్రవరిలోనే నిర్వహిస్తారనే ఉద్దేశంతో అప్పట్లో పంచాయతీరాజ్ శాఖ ఎంపీడీఓ లాగిన్ ద్వారా ఓటరు జాబితాను రూపొందించింది. ఆయా మండలాల పరిధిలోని గ్రామ పంచాయతీ కార్యదర్శులు తమ పరిధిలోని గ్రామాలు, ఆవాసాలలో ఉన్న ఓటర్ల జాబితాను ఎంపీడీఓ లాగిన్‌లో అప్‌లోడ్ చేశారు. అలా జిల్లా వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో ఓటరు జాబితా తయారు చేశారు. ఎంపీడీఓ దాన్ని పరిశీలించి డీపీఓకు పంపించారు. డీపీఓ వాటిని పరిశీలించి తుది జాబితాను ప్రకటించారు. అయితే ఎంపీడీఓ లాగిన్ ద్వారా ఓటర్ల జాబితా అప్‌లోడ్ చేయడం వల్ల చిన్న మార్పు వచ్చినా డీపీఓ స్థాయి నుంచి ఓటర్లను సరిచేయాల్సి రావడం వల్ల ఇబ్బందులు ఏర్పడేవి. దాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రస్తుతం పంచాయతీరాజ్ శాఖ ఆ విధానం మార్చి జీపీకి ప్రత్యేక లాగిన్ ఇచ్చింది.

ప్రతి జీపీకి ప్రత్యేక లాగిన్

ప్రస్తుతం పంచాయతీ రాజ్ శాఖ ప్రతి గ్రామ పంచాయతీకి ఒక టీపోల్ లాగిన్ ఇచ్చింది. ఆ లాగిన్‌లో ప్రతి గ్రామంలో ఉన్న ఓటరు జాబితాను వార్డుల వారీగా అప్‌లోడ్ చేశారు. గతంలో ఒక గ్రామం పరిధిలో గూడెం ఉంటే వాటికి ప్రస్తుతం పోలింగ్ స్టేషన్ కొత్తగా ఏర్పాటు చేశారు. దాంతో ఓటరు జాబితాలో పక్కగా ఏ ఓటరు ఎక్కడ ఉన్నాడనేది తెలిసేలా జీపీ లాగిన్ ద్వారా స్పష్టంగా తెలియనుంది. ఒక వేళ ఏదైనా జాబితాలో పొరపాటు అయితే ఓటరు జాబితాను గ్రామ పంచాయతీ లాగిన్‌లో అప్‌లోడ్ చేసిన తర్వాత అది ఎంపీడీఓలాగిన్‌కు వెళుతుంది. మార్పులు చేర్పులు ఉంటే ఎంపీడీఓ గ్రామ పంచాయతీ లాగిన్‌కు పంపి వాటిని సరిచేసే అధికారం ఇచ్చారు. గతంలో ఇలాంటి అవకాశం ఉండేది కాదు. జీపీ లాగిన్ వల్ల ఇలాంటి ఇబ్బందులకు చెక్ పెట్టేందుకు అవకాశం ఏర్పడింది. ఎంపీడీఓ లాగిన్ నుంచి తిరిగి డీపీఓ లాగిన్‌కు ఓటరు జాబితా పంపుతారు. అక్కడ పరిశీలించిన తర్వాత ఈ రెండు మూడు రోజుల్లో కొత్త ఓటరు జాబితా ప్రకటించనున్నట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం జీపీ టీపోల్ లాగిన్ ద్వారా కొత్తగా తయారు చేసిన ఓటరు జాబితాతోనే వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

సరిహద్దులో రేషన్ బియ్యం దందా!

మిర్యాలగూడ ప్రాంతంలో ఆగని అక్రమ వ్యాపారం

- పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నా షరామామూలే..
- ఏపీకి చెందిన వ్యాపారులే సూత్రధారులు
- ఇరు రాష్ట్రాల సరిహద్దు గ్రామాల్లో కొనుగోలు
- పల్నాడు జిల్లాలో మిల్లులకు విక్రయం
- అక్కడ పాలిష్ చేసి ఇతర రాష్ట్రాలకు యథేచ్ఛగా రవాణా



ఇటీవల వాడపల్లిలో పట్టుబడిన రేషన్ బియ్యం వాహనం

మిర్యాలగూడ : పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నాయి. పోలీసులు పటిష్టమైన నిఘా పెట్టి పట్టుకుంటూ చర్యలు తీసుకుంటున్నా.. చివరికి పీడీ యాక్ట్ నమోదు చేస్తున్నా మిర్యాలగూడ ప్రాంతంలో రేషన్ బియ్యం దందా మాత్రం ఆగడం లేదు. గతంలో తెలంగాణ నుంచి ఏపీ రాష్టానికి రేషన్ బియ్యం అక్రమంగా రవాణా జరిగేది. కానీ, ఇప్పుడు ఇక్కడి వారి సహాయంతో ఏపీకి చెందిన వ్యాపారులు కొందరు ఇక్కడా అక్కడా తక్కువ ధరకు రేషన్ బియ్యం కొని మిల్లులకు అమ్ముతున్నారు. ఆ బియ్యాన్నే మిల్లుల యజమానులు పాలిష్ చేసి తెలుగు రాష్ట్రాలతోపాటు గుజరాత్, మహారాష్ట్ర, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలకు తరలించి అధిక ధరలకు అమ్ముకుంటు న్నారు. తాజాగా రాష్ట్ర సరిహద్దులోని మిర్యాలగూడ పరిధిలో గల వాడపల్లి చెక్ పోస్టు వద్ద 600 బస్తాలు (300 క్వింటాళ్లు) రేషన్ బియ్యాన్ని పోలీసులు పట్టుకుని తరలిస్తున్న వారిని అరెస్ట్ చేశారు. ఇందులో అరెస్టయిన వారంతా ఏపీకి చెందిన వారు కావడం గమనార్హం.

కిలో పది రూపాయలకు కొని..

తెలంగాణలో ఆరు నెలలుగా రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. పక్కనున్న ఏపీ రాష్ట్రంలో దొడ్డు బియ్యాన్ని అందిస్తున్నారు. సరిహద్దులో ఉన్న తెలంగాణ గ్రామాల నుంచి ఏపీకి చెందిన కొందరు రేషన్ బియ్యాన్ని కిలో రూ.10 నుంచి రూ.11కు కొనుగోలు చేసి మిల్లులకు అమ్ముకుంటున్నారు. అలాగే సరిహద్దులోని ఇరు రాష్ట్రాలకు చెందిన గ్రామాల రేషన్ షాపుల డీలర్లు కూడా కిలోకు రూ.10 నుంచి 12 వరకు లబ్ధిదారుల నుంచి కొని మిల్లులకు కిలోకు రూ.25 నుంచి రూ.30ల చొప్పున విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. చివరకు మిల్లుల యజమానులు ఆ రేషన్ బియ్యాన్ని సన్నగా పాలిష్ చేయించి బ్రాండెడ్ బ్యాగుల్లో నింపి ప్రత్యేక వాహనాల్లో వివిధ రాష్ట్రాలకు రవాణా చేస్తూ కిలో రూ.40 నుంచి రూ.50లకు అమ్ముంటున్నారు.

నకిలీ బిల్లులు సృష్టించి..

ఏపీ రాష్ట్రం పల్నాడు జిల్లాలోని ఓ రైస్ మిల్‌లో పనిచేసే ఓ గుమస్తా తమ జిల్లాకు సరిహద్దులో ఉన్న తెలంగాణ పల్లెల్లో రేషన్ బియ్యం సేకరించి అదే మిల్లుకు తరలిస్తూ పెద్ద మొత్తంలో కమీషన్ తీసుకుంటున్నాడు. అక్కడికి వెళ్లిన రేషన్ బియ్యాన్ని పాలిష్ చేసి తెల్ల సంచుల్లో నింపి ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో నకిలీ బిల్లులు సృష్టించి రాష్ట్ర సరిహద్దు దాటించేందుకు ఒక ఏజెంట్‌ను నియమించుకుని అతనికి నెలకు రూ.3లక్షలకుపైగా కమీషన్ ఇస్తున్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

పోలీసులకు చిక్కని సూత్రధారులు..

ఇటీవల రాష్ట్ర సరిహద్దులోని వాడపల్లి చెక్‌పోస్టు వద్ద పెద్ద ఎత్తున రేషన్ బియ్యం పట్టుకున్నప్పటికీ అసలు సూత్రధారులు ఇప్పటివరకు చిక్కలేదు. ఆ సూత్రధారులకు ఏపీలో అధికార పార్టీ అండదండలు ఉండడంతో వారిపై చర్యలు తీసుకునేందుకు ఇరు రాష్ట్రాలకు చెందిన అధికారులు జంకుతున్నారు. ఇప్పటివరకు అనేక మంది రేషన్ బియ్యం అమ్ముతున్న వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసినా దందా ఆగడం లేదు. ఇటీవల పట్టుబడిన రేషన్ బియ్యం కేసులో ఎనిమిది మందికిగాను ఐదుగురిని అరెస్ట్ చేయగా ముగ్గురు అసలు సూత్రధారులు పరారీలో ఉన్నారు. అరెస్ట్ అయిన వారంతా ఏపీ రాష్టానికి చెందిన వారే.

పీడీ యాక్ట్ నమోదు చేస్తాం



రేషన్ బియ్యం అక్రమంగా రవాణా చేసినా, దందాకు సహకరించినా పీడీ యాక్ట్ నమోదు చేస్తాం. అక్రమ దందాపై సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతోపాటు సరైన పారితోషకాన్ని అందిస్తాం. మిర్యాలగూడ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో నిరంతరం నిఘా ఏర్పాటు చేస్తాం.

– రాజశేఖర్‌రాజు, డీఎస్పీ, మిర్యాలగూడ

క్లుప్తంగా

గుర్తుతెలియని యాచకురాలు మృతి

కొండమల్లేపల్లి: అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన గుర్తుతెలియని వృద్ధ యాచకురాలు చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కొండమల్లేపల్లి ఎస్‌ఐ అజ్మీరా రమేష్ తెలిపిన ప్రకారం.. కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని స్థితిలో ఉన్న వృద్ధ యాచకురాలిని ఆదివారం స్థానికులు గుర్తించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. 108 సిబ్బంది సదరు యాచకురాలిని దేవరకొండ ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. మృతురాలి వయస్సు 60 నుంచి 65 ఏళ్లు ఉంటుందని, ఆకుపచ్చ పువ్వులు గల చీర ధరించి ఉన్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు 8712670226, 8712670158 నంబర్లకు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ సూచించారు.

విద్యుదాఘాతంతో..

భువనగిరి: భువనగిరి మండలంలోని బొమ్మాయిపల్లి–నాగిరెడ్డిపల్లి రైల్వే స్టేషన్ల మధ్య శనివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తి (సుమారు 60 ఏళ్లు) రైలు పట్టాల పక్కన నడుకుంటూ వెళ్తూ రైల్వే కేబుల్ బాక్సుల వద్ద విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడు గులాబీ రంగు చొక్కా, తెలుపు రంగు లుంగీ ధరించి ఉన్నట్లు రైల్వే పోలీసులు పేర్కొన్నారు. మృతదేహాన్ని భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రికి మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన 98482 22169 నంబర్‌ను సంప్రదించాలని భువనగిరి రైల్వే పోలీస్ ఇన్‌చార్జి కృష్ణారావు సూచించారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడు..


యాదగిరి (ఫైల్)

చింతపల్లి: చింతపల్లి మండలం మల్లారెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాల ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుడు యాదగిరి(59) ఆదివారం గుండెపోటుతో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని మన్నెగూడలో తన నివాసంలో ఆదివారం మధ్యాహ్నం యాదగిరి నిద్రిస్తుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. యాదగిరి మృతి వార్త తెలుసుకున్న వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ఎంఈఓ అంజయ్య, పాఠశాల ఉపాధ్యాయులు కోట్ల యాదగిరి, ముసుగు ఆనంద్‌బాబు, ఒడుగు ప్రకాష్ ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. యాదగిరి గత 10సంవత్సరాలుగా చింతపల్లి మండలంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు.

వైద్య కళాశాలకు వృద్ధుడి పార్థివదేహం అప్పగింత


నివాళులర్పిస్తున్న స్పందన అవయవ దాన సేవా సంస్థ సభ్యులు

సూర్యాపేట: సూర్యాపేట పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో నివాసముంటున్న స్వాతంత్య్ర సమరయోధుడు టంగుటూరు కోటయ్య వయోభారంతో ఆదివారం మృతిచెందారు. కోటయ్య భౌతికకాయానికి స్పందన అవయవ దాన సేవా సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు గుండా రమేష్, మిట్టకోల కోటయ్య, కోశాధికారి హనుమాన్ల పిచ్చిరెడ్డి, సభ్యుడు శ్రీనివాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కోటయ్య పార్థివదేహాన్ని కుటుంబ సభ్యుల అనుమతితో వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాలోని దిండిగల్‌లో గల అరుంధతి వైద్య కళాశాలకు అప్పగించారు.

యాదగిరిగుట్టలో భక్తుల రద్దీ

యాదగిరిగుట్ట: యాదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవురోజు కావడంతో పాటు శ్రావణమాసం కలిసి రావడంతో భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, మాడ వీధుల్లో భక్తులు ఎక్కువగా కనిపించారు. స్వామివారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటలకు పైగా, వీఐపీ దర్శనానికి 30 నిమిషాల సమయం పట్టింది. స్వామిని 30వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. వివిధ పూజలతో నిత్యాదాయం రూ.37,49,950 వచ్చినట్లు ఆలయాధికారులు వెల్లడించారు.


యాదగిరిగుట్ట పైన మాడ వీధుల్లో సేద దీరుతున్న భక్తులు

దొడ్డా పద్మ ఆశయాలు సాధించాలి


దొడ్డా పద్మా సంతాప సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం


మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య విగ్రహానికి పూలమాల వేస్తున్న సీపీఐ రాష్ట్ర నాయకులు

- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చిలుకూరు: హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య సతీమణి, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు దొడ్డా పద్మ ఆశయాలను సాధించాలని సీపీఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. ఆదివారం చిలుకూరులో దొడ్డా పద్మ సంతాప సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట సమయంలో తన భర్త దొడ్డా నర్సయ్యతో కలిసి నల్లమల్ల అడవుల్లో మూడేళ్ల పాటు అజ్ఞాతవాసం చేసిన మహోన్నత మహిళ దొడ్డా పద్మ అన్నారు. ఆమె మరణం సీపీఐకి తీరనిలోటని అన్నారు. అంతకుముందు చిలుకూరు సీపీఐ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి మాజీ ఎమ్మెల్యే దొడ్డా నర్సయ్య విగ్రహానికి నివాళులర్పించారు. అదేవిధంగా స్వాంతంత్య్ర సమరయోధుడు దొడ్డా నారాయణరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ప్రముఖ వైద్యుడు జాస్తి సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో అందె సత్యం, సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు వక్కంతుల కోటేశ్వరరావు, సీపీఐ ఏపీ రాష్ట్ర నాయకులు చలసాని రాఘవేంద్రరావు, చలసాని రామారావు, కాట్రగడ్డ స్వరూపరాణి, మాజీ డీసీసీబీ చైర్మన్ ముత్తవరపు పాండురంగారావు, సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, మండల కార్యదర్శి, సహాయ కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు, సాహెబ్ అలీ, జిల్లా, మండల నాయకులు మేకల శ్రీనివాసరావు, పోకల వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, సూర్యనారాయణ, దేవరం మల్లేశ్వరీ, చేపూరి కొండలు, చిలువేరు అంజనేయులు, సుల్తాన్ వెంకటేశ్వర్లు, నంధ్యాల రామిరెడ్డి, సిరాపురపు శ్రీనివాస్‌రావు, బాలేబోయిన రాంబాబు, అనంతుల రాము, కస్తూరి సైదులు, కొండలు, లక్ష్మయ్య , వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సోదరుడికి రాఖీ కట్టేందుకు వచ్చి..

- రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

నకిరేకల్: తమ్ముడికి రాఖీ కట్టేందుకు వచ్చి రోడ్డు ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఈ ఘటన నకిరేకల్ మండలం తాటికల్ గ్రామ శివారులోని ఆర్లగడ్డ గూడెంలో శనివారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వేములపల్లి మండలం సల్కునూరు గ్రామానికి చెందిన నర్సింగ్ అంజమ్మ (70) తన తమ్ముడు ఎల్లయ్యకు రాఖీ కట్టేందుకు శనివారం నకిరేకల్ మండలం ఆర్లగడ్డగూడేనికి వచ్చింది. తమ్ముడికి రాఖీ కట్టాక ఊర్లో పెళ్లి ఊరేగింపు జరుగుతుండడంతో అంజమ్మ రోడ్డు పైకి వచ్చింది. ఈ క్రమంలో అంజమ్మ రోడ్డు దాటుతుండగా.. నల్లగొండ నుంచి నకిరేకల్ వైపు వెళ్తున్న బొలేరో వాహనం అతివేగంగా వచ్చి ఆమెను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలి తమ్ముడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లచ్చిరెడ్డి తెలిపారు.

నిషేధిత పాన్ మసాలాలు, సిగరెట్లు స్వాధీనం

చౌటుప్పల్: చౌటుప్పల్ పట్టణ కేంద్రంలో పోలీసులు ఆదివారం పలు కిరాణా దుకాణాల్లో, పాన్ షాపుల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిషేధిత పాన్ మసాలాలు, సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వం నిషేధించిన సిగరెట్లు, గుట్కాలను విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ మన్మథకుమార్ హెచ్చరించారు.

మాంసం విక్రయ దుకాణాల్లో తనిఖీలు


మాంసం దుకాణాల్లో తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి పెంటయ్య, మున్సిపల్ సిబ్బంది

కోదాడరూరల్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోదాడ పట్టణంలోని మాంసం విక్రయ దుకాణాల్లో ఆదివారం మున్సిపల్ సిబ్బందితో కలిసి కోదాడ పశువైద్యాధికారి పెంటయ్య తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో 35 చోట్ల మటన్, 9 చోట్ల పశు మాంసం, ఐదు చోట్ల పంది, మరో 9 చోట్ల చేపలను విక్రయిస్తున్నారని వారు గుర్తించారు. నిబంధనల ప్రకారం మాంసం విక్రయదారులు ఆయా జంతువులను పశువైద్యాధికారులు పరీక్షించి ఆరోగ్యంగా ఉందని సర్టిఫికెట్ జారీ చేసిన తర్వాతే వధించి మాంసం విక్రయించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది రాజయ్య, బాబురావు, ఆనందరావు ఉన్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి రిమాండ్


పరమేశ్వర్

చౌటుప్పల్: తల్లిదండ్రులపై కోపంతో హైదరాబాద్‌కు వచ్చిన యువతికి ఉపాధి చూపించి, ఆమెను నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తిని చౌటుప్పల్ పోలీసులు ఆదివారం రిమాండ్‌కు తరలించారు. చౌటుప్పల్ సీఐ మన్మథకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని విజయవాడకు చెందిన యువతి 2024లో తల్లిదండ్రులతో గొడవపడి ఆవేశంలో ఎవరికీ చెప్పకుండా బస్సు ఎక్కి హైదరాబాద్‌కు వచ్చింది. అక్కడ ఇమ్లీబన్ బస్‌స్టేషన్‌లో బస్సు దిగింది. ఈ క్రమంలో బస్‌స్టేషన్‌లోనే కొంత మంది వ్యక్తులను ఏదైనా పని ఉంటే చెప్పండని అడిగింది. ఓ వ్యక్తి సంస్థాన్‌నారాయణపురం మండలం సర్వేల్ గ్రామానికి చెందిన పంది పరమేశ్వర్ అలియాస్ ఈశ్వర్ పేరు చెప్పి అతడి సెల్ నంబర్‌ను యువతికి ఇచ్చాడు. అతడిని సంప్రదిస్తే పని చూపిస్తాడని చెప్పి ఆ వ్యక్తి వెళ్లిపోయాడు.

ఉపాధి చూపించి యువతికి దగ్గరై..

సెల్ నంబర్ తీసుకున్న ఆ యువతి వెంటనే పరమేశ్వర్‌కు ఫోన్ చేసి ఉపాధి కల్పించాలని కోరింది. దీంతో ఆమెను తాను మార్కెటింగ్ ఏజెంట్‌గా పనిచేస్తున్న హైదరాబాద్‌లోని కొత్తపేటలో గల రియల్ ఎస్టేట్ ఆఫీస్ వద్దకు రమ్మన్నాడు. చెప్పినట్లుగానే ఆ యువతికి తాను పనిచేసే కార్యాలయంలోనే పరమేశ్వర్ ఉద్యోగం ఇప్పించాడు. కొంతకాలం తర్వాత హైదరాబాద్‌లోని నాగోల్‌లో గల వృద్ధాశ్రమంలో పనికి పెట్టించాడు. అలా యువతిని బాగా నమ్మించాడు. ఈ క్రమంలో ఆమెను లొంగదీసుకుని గర్భవతిని చేశాడు. దీంతో సదరు యువతి నుంచి పరమేశ్వర్‌పై ఒత్తిడి పెరిగిపోయింది. అప్పటికే పెళ్లై భార్యాపిల్లలు కల్గి ఉన్న పరమేశ్వర్‌కు ఏమి చేయాలో తెలియక యువతిని హైదరాబాద్‌లోని చైతన్యపురిలో హాస్టల్‌లో చేర్పించి మళ్లీ వస్తానని చెప్పి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అతడికి సదరు యువతి ఫోన్ చేసినా స్పందించలేదు. దీంతో తాను మోసపోయానని గ్రహించిన యువతి చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన అక్కడి పోలీసులు కేసును చౌటుప్పల్‌కు బదిలీ చేశారు. సీఐ మన్మథకుమార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టిన పోలీసులు పరమేశ్వర్‌ను అదుపులోకి తీసుకుని ఆదివారం చౌటుప్పల్‌లోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చారు. అనంతరం నిందితుడిని నల్లగొండలోని జైలులో రిమాండ్ చేశారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

- మరొకరు పరారీ
- రెండు కేజీల గంజాయి స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న తిప్పర్తి ఎస్‌ఐ శంకర్

తిప్పర్తి: తిప్పర్తి మండలం అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తలించారు. ఎస్‌ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం.. తిప్పర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని కేశరాజుపల్లి గ్రామానికి చెందిన మేడిశెట్టి పరుశురాములు, నల్లగొండ పట్టణంలోని బీటీఎస్ ప్రాంతానికి చెందిన ఎండీ షఫీ గంజాయి విక్రయిస్తున్నారని పక్కా సమాచారం అందడంతో ఆదివారం తిప్పర్తి ఎస్‌ఐ శంకర్ తన సిబ్బందితో కలిసి అనిశెట్టి దుప్పలపల్లి గ్రామ శివారులో సోదాలు నిర్వహించగా మేడిశెట్టి పరుశురాములు పట్టుబడ్డాడు. షఫీ పరారయ్యాడు. పరుశురాములు వద్ద రెండు కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితులు హైదరాబాద్‌లోని ధూల్‌పేట నుంచి గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో మార్చి విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు. స్వాధీనం చేసుకున్న గంజాయిని సీజ్ చేసి పరుశురాములును రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. షఫీ కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

రిటైర్డ్ పోలీస్ ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న రిటైర్డ్ పోలీస్ ఉద్యోగులు

కనగల్: 1979లో పోలీస్ ఉద్యోగంలో చేరి వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ పొందిన పోలీస్ ఉద్యోగులు ఆదివారం కనగల్ మండల శివారులోని పాశం పుల్లారెడ్డి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు ఉద్యోగం చేసినప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుని ఆనందంగా గడిపారు. సామూహిక భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వీరస్వామిగౌడ్, చెన్నారెడ్డి, నజీర్, నిజాం, వీరారెడ్డి, చంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, అంతయ్య, సంజీవరెడ్డి, జబ్బార్, నజీముద్దీన్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

HOUSE FOR SALE

■ 2, 3&4BHK లగ్జరీ విల్లాలు. నివసించుటకు సిద్ధంగా ఉన్నాయి. రూ.80 లక్షల నుండి, డి–మార్ట్ పక్కన మిర్యాలగూడ, ఆధునిక సౌకర్యాలు, క్లబ్, స్విమ్మింగ్ పూల్, సంప్ర ఫోన్: 9949190523 [HA-389]

Wanted

■ భువనగిరి లో పని చేయుటకు 40 సంవత్సరాల వయస్సు లోపు గల సెక్యూరిటీ గార్డులు వెంటనే కావలెను. పీఎఫ్, ESI, శాలరీ : 15,000/- రూమ్ మరియు FOOD ఫ్రీ, 12 గంటల డ్యూటీ, Height: 5.8' సంప్రదించు సెల్ నెం. : 6304719869 [SCA25007116]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనల చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రకటన గౌరంతో! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు

నాలుగు లైన్లకు రూ.:220/- (Black & White)

అదనపు లైనుకు రూ.: 50/- మాత్రమే

5% GST అదనం

నల్లగొండ : 9912220737, 9010080143, 9010002038

మిర్యాలగూడ : 9666021744

సూర్యాపేట : 9912220740 9010038110

కోదాడ : 9010046033

భువనగిరి : 9010073592

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


కళాశ్రీ (ఫైల్)

పాలకవీడు: కుటుంబ కలహాలతో ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పాలకవీడు మండలం రావిపహాడ్ గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్‌ఐ ఆర్. కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. రావిపహాడ్ గ్రామానికి చెందిన బట్ట పవన్, కళాశ్రీ(20) భార్యాభర్తలు, వీరికి 6 నెలల కుమార్తె ఉంది. కొద్దిరోజులుగా పవన్, కళాశ్రీ మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో మనస్తాపానికి గురైన కళాశ్రీ ఆదివారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కళాశ్రీ కుమార్తె ఏడుపు వినిపించడంతో కుటుంబ సభ్యులు గమనించి కళాశ్రీని కిందకు దించారు. కళాశ్రీ ఒంటిపై గాయాలతో పాటు దుస్తులు చిరిగిపోయి ఉన్నాయని, ఆమె భర్త పవన్, అత్త ఉమ, మామ హనుమంతు, ఆడపడుచు ప్రియ అందరూ కలిసి తమ కుమార్తె కొట్టి చంపినట్లు కళాశ్రీ తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనారోగ్యంతో డిప్యూటీ తహసీల్దార్ మృతి


శివగణేష్‌కుమార్ (ఫైల్)

భువనగిరిటౌన్ : యాదాద్రి భువనగిరి కలెక్టరేట్‌లో ఎస్‌డీసీ డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న శివగణేష్‌కుమార్ అనారోగ్యంతో హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందారు. ఆయనకు భార్యతో పాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు. శివగణేష్‌కుమార్ మృతి పట్ల యాదాద్రి కలెక్టరేట్ ఉద్యోగులు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన గతంలో రాజాపేట మండల తహసీల్దార్ కార్యాలయంలో కూడా విధులు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

నాగారం: సూర్యాపేట–జనగామ రహదారిపై నాగారం మండలం ఫణిగిరి శివారులో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి మండలం తొండ గ్రామానికి చెందిన గొలుసుల నరేష్(27) తిరుమలగిరి నుంచి బైక్‌పై తన స్నేహితుడు ప్రశాంత్‌తో కలిసి సూర్యాపేటకు పని నిమిత్తం వెళ్తుండగా.. ఫణిగిరి గ్రామ శివారులో గుర్తుతెలియని వాహనం బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని నరేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. గాయపడిన ప్రశాంత్‌ను చికిత్స నిమిత్తం సూర్యాపేటకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు స్థానిక ఎస్‌ఐ ఎం. ఐలయ్య తెలిపారు.

కాంగ్రెస్ ప్రభుత్వం అన్నిరంగాల్లో విఫలం

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్‌రెడ్డి


మాట్లాడుతున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

సూర్యాపేటటౌన్: రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట నియోజకవర్గ వ్యాప్తంగా పలు కార్యక్రమాల్లో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డికి పాలన చేతకాకనే కాలం వెళ్లబుచ్చుతున్నాడన్నారు. రెండేళ్లు కావొస్తున్నా రేవంత్ బూతు పురాణాలు మానడం లేదన్నారు. ఇంకా ప్రతిపక్షంలోనే ఉన్నట్లే మాట్లాడుతున్నాడని, ప్రజలకు ఇచ్చిన హామీలను మరిపించేందుకు కొత్త నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. రాష్ట్రం ఏ ఒక్క రంగంలో కూడా అడుగు ముందుకేసిన దాఖలాలు లేవని, గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని కూడా కుంటుపట్టిస్తున్నారన్నారు. కొత్త ఇళ్లు కట్టిస్తామని చెప్పి.. ఉన్న ఇళ్లే కూలగొట్టే పని చేపట్టారని, కొత్త ప్రాజెక్టుల మాట దేవుడెరుగు.. ఉన్న ప్రాజెక్టులను బంద్ పెట్టి పొలాలను ఎండబెడుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ బీజేపీ సహకారంతోనే కేసీఆర్‌పై కుట్రలు చేస్తోందని, బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఇద్దరికీ కేసీఆరే ప్రధాన శత్రువు అన్నారు. దీంతో రాబోయే రోజుల్లో తెలంగాణలో మళ్లీ కేసీఆర్ అధికారంలోకి వస్తాడని వాళ్లకు అర్థమైందన్నారు. స్ట్రీట్ ఫెలో స్టేట్ లీడర్ అయ్యాడని ఆయన విమర్శించారు. ఎప్పుడు ఏం మాట్లాడుతారో తెలియని అజ్ఞాన కాంగ్రెస్ మంత్రులతో ఏం అభివృద్ధి సాధిస్తారని దుయ్యబట్టారు.

ఉపేంద్రచారికి స్వర కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారం


స్వర కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకుంటున్న ఉపేంద్రచారి

సూర్యాపేట: సూర్యాపేట మున్సిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న గుండెపురి ఉపేంద్రచారికి స్వర కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారం లభించింది. ఏపీలోని ఏలూరులో ఆదివారం శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన సింగర్స్ ఫెస్ట్–2025లో శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్‌కుమార్ చేతులమీదుగా ఉపేంద్రచారి జాతీయ ప్రతిభా పురస్కారం అందుకున్నారు. గానం, కళా రంగంలో తన ప్రత్యేకతను చాటుకున్న ఉపేంద్రచారికి స్వర కిరీటి జాతీయ ప్రతిభా పురస్కారం అందజేసినట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీశ్రీ కళావేదిక నిర్వాహకులు ఈశ్వరి భూషణం, లలిత, టి. పార్థసారథి, శ్రీహరి కోటి తదితరులు పాల్గొన్నారు. ఉపేంద్రచారికి సూర్యాపేట మున్సిపల్ అధికారులు, సిబ్బంది, శ్రేయోభిలాషులు, బంధువులు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

సాహిత్య సమ్మేళనానికి హాజరైన వెల్దండి శ్రీధర్


మాట్లాడుతున్న ఎన్జీ కళాశాల తెలుగు విభాగం అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల(ఎన్జీ) తెలుగు విభాగం అధ్యక్షుడు వెల్దండి శ్రీధర్ ఈ నెల 8, 9, 10 తేదీల్లో బెంగళూరులో జరిగిన బుక్ బ్రహ్మ దక్షిణ భారత సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తెలుగు సాహిత్యం–తెలంగాణ ప్రత్యేకతలు అనే అంశంపై జరిగిన చర్చా కార్యక్రమంలో ప్రముఖ విమర్శకులు కె. శ్రీనివాస్, సాహిత్య చరిత్రకారులు డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, స్త్రీవాద రచయిత్రి షాజహానతో కలిసి తన అభిప్రాయాలను పంచుకున్నారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. తెలంగాణ భాష, సంస్కృతి, మధ్య తరగతి ప్రజల జీవితాలను సురవరం ప్రతాపరెడ్డి, ధరణికోట శ్రీనివాసులు, నందగిరి వెంకటరావు వంటి వారు తమ కథల్లో అద్భుతంగా వివరించారని పేర్కొన్నారు. తర్వాత కాలంలో పెద్దింటి అశోక్‌కుమార్, బీఎస్ రాములు, కాలువ మల్లయ్య, బెజ్జరపు రవీందర్ లాంటి వాళ్లు మధ్యతరగతి జీవితాలను కథలుగా మలిచారని అన్నారు. 1980ల తర్వాత అనేక మంది బహుజన రచయితలు కథా రచనలోకి వచ్చి ఎన్నో మధ్యతరగతి కథలు రాశారని వివరించారు. ఈ సాహిత్య సమ్మేళనంలో పాల్గొన్న వెల్దండి శ్రీధర్‌ను ఎన్జీ కళాశాల ప్రిన్సిపాల్ సముద్రాల ఉపేందర్, వైస్ ప్రిన్సిపాల్ పరంగి రవికుమార్, ఆర్ట్స్ వైస్ ప్రిన్సిపాల్ అంతటి శ్రీనివాస్, పరీక్షల నియంత్రణాధికారి బత్తిని నాగరాజు, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ప్రసన్నకుమార్, అధ్యాపకులు అభినందించారు.

మినీ శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన


కూచిపూడి నృత్య ప్రదర్శన ఇస్తున్న చిన్నారులు



భువనగిరి: భువనగిరి మండలం రాయగిరి గ్రామ పరిధిలోని పెద్ద చెరువు పక్కన గల మినీ శిల్పారామంలో ఆదివారం రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చిన్నారులచే కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి దర్శనానికి వచ్చిన భక్తులు తిరుగు ప్రయాణంలో మినీ శిల్పారామాన్ని సందర్శించి నృత్య ప్రదర్శనను తిలకించారు. అదేవిధంగా బోటులో ఎక్కి చెరువులో విహరిస్తూ ఆహ్లాదంగా గడిపారు. నృత్య ప్రదర్శన ఇచ్చిన వారిలో రితిక, అమృత, లలిత, సాహితి తదితరులు ఉన్నారు.

24.5 అడుగులకు చేరిన డిండి నీటి మట్టం

డిండి: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాల్లో కురుస్తున్న వర్షాలకు దుందుబి వాగు పరవళ్లు తొక్కడంతో డిండి ప్రాజెక్టులోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 36అడుగులు కాగా ఆదివారం సాయంత్రానికి 24.5అడుగుల వరకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులోకి ఇన్‌ఫ్లో 2800 క్యూసెక్కులు వస్తుందని, ఎడమ కాలువ ద్వారా దిగువకు 120 క్యూసెక్కుల నీరు విడుదలవుతుందని ఇరిగేషన్ ఏఈ పరమేష్ తెలిపారు.


24.5 అడుగుల వద్ద నీటి మట్టాన్ని చూపుతున్న డిండి ప్రాజెక్టులోని సూచిక

శతాధిక వృద్ధుడు మృతి


రామయ్య(ఫైల్)

ఆత్మకూరు(ఎం): ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖాన్‌పేట గ్రామానికి చెందిన సీపీఐ నాయకుడు మంచోజు రామయ్య(105) ఆదివారం ఉదయం మృతిచెందారు. ఆయన నిజాం ఆగడాలకు వ్యతిరేకంగా బాల సంఘంలో పనిచేశారు. రామయ్య భౌతికకాయంపై సీపీఐ జెండాను ఉంచి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాశికంటి లక్ష్మీనర్సయ్య, శాఖ కార్యదర్శి తాళ్లపల్లి నర్సయ్యగౌడ్ తదితరులు శ్రద్ధాంజలి ఘటించారు.

నేలకొరిగిన 80 ఏళ్ల మర్రిచెట్టు



నడిగూడెం: నడిగూడెం మండల పరిధిలోని చాకిరాల వద్ద నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కట్టపై గల 80 ఏళ్ల మర్రిచెట్టులోని ఓ భాగం ఆదివారం వీచిన భారీ గాలికి, వర్షానికి కూలింది. చెట్టు కూలిన సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కట్టపై చెట్టు కూలడంతో రైతుల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. నీటిపారుదల శాఖ అధికారులు స్పందించి కూలిన చెట్టును తొలగించాలని రైతులు కోరుతున్నారు.